క్లుప్తంగా

మార్టేరు 14వ వార్డులో ముక్కోణపు పోటీ

పెనుమంట్ర: మండలంలో రాజకీయ చైతన్యం కలిగి అధిక ఓట్లు ఉన్న గ్రామం మార్టేరులోని 14వ వార్డుకు ఈనెల 19న ఉప ఎన్నిక జరగనున్నది. ఎస్సీ మహిళకు రిజర్వ్ చేసిన ఈ వార్డులో గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి చెందిన జాలెం మహాలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే ఆమె గతేడాది మృతిచెందడంతో ఈ వార్డుకు ఉప ఎన్నిక అనివార్యమైంది. 497 మంది ఓటర్లు ఉన్న ఈ వార్డులో మహాలక్ష్మి కుమార్తె జాలెం సుచంద్రికతో పాటు కప్పల అనంతలక్ష్మి, కారెం వరలక్ష్మి పోటీపడుతున్నారు. ప్రధాన పోటీ సుచంద్రిక, అనంతలక్ష్మి మధ్యే ఉంటుందని, ఎవరు గెలిచినా వైఎస్సార్ సీపీ వారేనని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామం అంతా వైఎస్సార్ సీపీ ఆధిపత్యంలోనే ఉందని, పెనుమంట్ర జెడ్పీటీసీ కర్రి గౌరీ సుభాషిణి ఈ గ్రామస్తురాలు కాగా, మార్టేరు 1, 2 ఎంపీటీసీ సభ్యులు గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, కర్రి అనురాధా జోగిరెడ్డి, గ్రామ సర్పంచ్ మట్టా కుమారి రాము, ఉప సర్పంచ్ కర్రి వేణుబాబు అంతా వైసీపీ వారే కావడంతో 14 వార్డులు ఉన్న ఈ గ్రామంలో వైఎస్సార్ సీపీ హవాయే కొనసాగుతుందని, ఇక్కడ ఎవరు గెలిచినా వైఎస్సార్ సీపీదే విజయమని గ్రామస్తులు చెబుతున్నారు.

అసత్య ప్రచారంపై పోలీసులకు ఫిర్యాదు

పాలకొల్లు అర్బన్: 'ప్రజానాడి' పేరుతో సామాజిక మాధ్యమంలో వైఎస్సార్ సీపీ నాయకులపై దుష్ప్రచారం చేస్తూ పోస్టు పెట్టిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గురువారం పాలకొల్లు పట్టణ సీఐ డి.రాంబాబును ఆ పార్టీ శ్రేణులు కోరారు. బుధవారం జరిగిన వైఎస్సార్ సీపీ పట్టణ కార్యకర్తల సమావేశంలో అధ్యక్షుడు చందక సత్తిబాబును పార్టీ కార్యకర్తలు దుర్భాషలాడినట్లు, సమావేశానికి హాజరైన చింతలపూడి, దెందులూరు నియోజకవర్గాల పరిశీలకులు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీలు కోపంతో సమావేశం నుంచి వెళ్లిపోయినట్లు, అలాగే నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి సందిగ్ధంలో పడినట్లు ప్రజానాడిలో అసత్యాలతో కూడిన విషయాలను సామాజిక మాధ్యమంలో ప్రచారం చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఐకి ఫిర్యాదు చేసిన వారిలో వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు చందక సత్తిబాబు, మండల కన్వీనర్ ఎం.మైఖేల్‌రాజు, పార్టీ నాయకులు కావలి శ్రీనివాసరావు, రావి నాగేశ్వరరావు, చినిమిల్లి గణపతిరావు, శీలం సూరిబాబు, ఉప్పె పండుబాబు, కెల్లా దుర్గారావు, శంకరాపు శ్రీను, యలకల రంగా, ఇజ్జాడ చినబాబు, కొరగింజల శ్రీనివాసరావు, కేశవరపు సత్యనారాయణ, గుండుబోయిన నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు చర్యలు

పాలకొల్లు అర్బన్: కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేసేందుకు న్యాయపరమైన, చట్టపరమైన చిక్కులను అధిగమించి జీవో విడుదల చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు స్పష్టం చేశారు. పాలకొల్లు ఏఎంసీ అతిథి గృహంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మూడు నెలల క్రితం కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని ఆయన గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో కాంట్రాక్టు ఉద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేరుస్తూ నిర్ణయం తీసుకున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో చంద్రబాబు కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయబోమని, దీనికి సుప్రీంకోర్టు అనుమతించదంటూ కుంటి సాకులు చెప్పారన్నారు. 2014 సెప్టెంబర్ 9న ముగ్గురు మంత్రుల బృందాన్ని నియమిస్తూ జీవో విడుదల చేసిందన్నారు. ఆ బృందం ఐదేళ్లపాటు సమావేశాలతో సాగదీసి చివరకు కోర్టు తీర్పు బూచి చూపించి కాంట్రాక్టు ఉద్యోగులకు తీరని ద్రోహం చేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 12,138 మంది కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించనున్నట్లు ఆయన చెప్పారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ ఎం.మైఖేల్‌రాజు, దేవ రాజేష్ కుమార్, సాల శ్రీనివాస్, దొంగా జ్యోతిబసు, వీరవల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

లంకలకోడేరు పాఠశాలకు మైక్ సెట్ బహూకరణ

పాలకొల్లు అర్బన్: మండలంలోని లంకలకోడేరు ప్రాథమిక పాఠశాల నెం.2కు పారిశ్రామికవేత్త నడపన జగపతిరావు రూ.10వేలు విలువైన మైక్ సెట్‌ను గురువారం బహూకరించారు. భవిష్యత్తులో పాఠశాలకు ఏ అవసరం ఉన్నా తన సహకారం ఉంటుందని దాత జగపతిరావు హామీ ఇచ్చారు. విద్యా అవసరాలకు ఈ మైక్ సెట్ ఎంతో ఉపయోగపడుతుందని హెచ్‌ఎం శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కో ఆర్డినేటర్ తోకల జనార్దన్,, జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి వినతి

నరసాపురం రూరల్: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని ఏపీయూడబ్ల్యూజే నరసాపురం నేతలు గురువారం కోరారు. ఏపీయూడబ్ల్యూజే వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవోకు సంఘ నేతలు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. సంఘ నేతలు పాల్గొన్నారు.

నరసాపురం లైబ్రరీకి సొంత భవనం

- వేగంగా గ్రంథాలయ నిర్మాణ పనులు
- రూ.1.18 కోట్లతో మూడంతస్తుల భవనం
- డిసెంబర్ నాటికి కొత్త భవనంలోకి లైబ్రరీ
- కాటన్ పార్కు వద్ద నిర్మాణం


కాటన్ పార్కు వద్ద సాగుతున్న గ్రంథాలయ భవన నిర్మాణ పనులు


లైబ్రరీకి బస్టాండ్ వద్ద నుంచి ప్రజలు రావడానికి వీలుగా నిర్మిస్తున్న వంతెన

నరసాపురం: నరసాపురం పట్టణంలో కాటన్ పార్కు వద్ద చేపట్టిన గ్రంథాలయ నూతన భవన నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. గత ఏడాది గ్రంథాలయ నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.18 కోట్లు మంజూరు చేసింది. దీంతో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సూచన మేరకు రైల్వే స్టేషన్ రోడ్డులోని కాటన్ పార్కు వద్ద 25 సెంట్ల మున్సిపల్ స్థలాన్ని గ్రంథాలయం కోసం కేటాయించి పనులను ప్రారంభించారు. వచ్చే డిసెంబర్ నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు. దీంతో ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న నరసాపురం గ్రంథాలయానికి సొంత భవనం ఏర్పాటు కానుంది. 1954లో నరసాపురంలో గ్రంథాలయాన్ని స్థాపించారు. ప్రస్తుతం గ్రేడ్–1 గ్రంథాలయంగా కొనసాగుతోంది. ఇప్పటికీ ఈ గ్రంథాలయానికి ప్రతిరోజూ 200 మంది వరకు రీడర్స్ వస్తుంటారు. అయితే భవనమే అసలు సమస్య. అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య గ్రంథాలయంలో సేవలు కొనసాగుతున్నాయి. ఇరుకు గదుల్లో, ఆరుబయట పుస్తకాలు చదవాల్సిన పరిస్థితి.

70 ఏళ్ల సమస్యకు మోక్షం

1954 నుంచి పట్టణంలోని అనేక అద్దె భవనాల్లో లైబ్రరీ మారుతూ వచ్చింది. ప్రస్తుతం శారదా థియేటర్ వద్ద అద్దె భవనంలో కొనసాగుతోంది. లైబ్రరీని అద్దె భవనం నుంచి తప్పించి సొంత అడ్రస్ సమకూర్చాలనే ప్రయత్నం గత పాలకులు, ప్రభుత్వాలు చేయనేలేదు. గత టీడీపీ హయాంలో నిధులు అందుబాటులో ఉన్నా కూడా కనీసం స్థల సేకరణపై దృష్టి పెట్టని దారుణ పరిస్థితి. దాదాపు 70 ఏళ్ల సమస్యకు ముదునూరి ప్రసాదరాజు పరిష్కారం చూపించారు. అంతేకాక ఇప్పటికే ఇటు బస్టాండ్ రోడ్డు నుంచి కాటన్ పార్కుకు వెళ్లే మార్గంలో కాలువపై వంతెన నిర్మాణం పూర్తి చేశారు. ఇప్పుడు కాటన్ పార్కు వద్ద కడుతున్న లైబ్రరీ భవనానికి బస్టాండ్ వద్ద నుంచి ప్రయాణికులు నేరుగా చేరుకోవచ్చు.

లైబ్రరీని అభివృద్ధి చేస్తాం



నరసాపురం లైబ్రరీ పురాతనమైనది. మున్సిపాలిటీ ఏర్పడక రెండేళ్ల ముందే ఇక్కడ లైబ్రరీని ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు సొంత భవనం లేకపోవడం బాధాకరం. ఇప్పుడు కొత్తగా నిర్మించబోయే భవనంలో అన్ని వసతులు ఏర్పాటు చేయించి, భవిష్యత్‌లో డిజిటల్ లైబ్రరీగా అభివృద్ధి చేస్తాం. అటు పార్కు, ఇటు లైబ్రరీకి చేరుకోడానికి అనువుగా ఉంటుందనే కాలువపై కాలిబాట వంతెన నిర్మించాం.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం


చెక్కును అందజేస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు తదితరులు

నరసాపురం రూరల్: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం అని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కును ఆయన లబ్ధిదారుని కుటుంబ సభ్యులకు అందజేశారు. నరసాపురం 10వ వార్డులో ఇటీవల అనారోగ్యానికి గురైన రాజోలు రాజేష్ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.10లక్షల చెక్కును ప్రసాదరాజు చేతుల మీదుగా రాజేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కేంద్ర పాలక మండలి సభ్యుడు పీడీ రాజు, కామన బాల సత్యనారాయణ (బుజ్జి), గొట్టుముక్కల సూర్యనారాయణ, సఖినేటిపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మానవత ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

పాలకొల్లు అర్బన్: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 28వ వార్డుకు చెందిన గంధం వెంకట సురేష్ కాలేయ వ్యాధితో బాధపడుతున్నాడు. అతనికి మానవత సభ్యుడు కోలాటి రవీంద్రనాథ్ బెనర్జీ దంపతులు రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మానవత కార్యదర్శి పీఎస్ ప్రతాప్‌రాజు, మాజీ అధ్యక్షుడు గుడాల హరిబాబు, బొక్కా గంగాధర్, ముత్యాల శ్రీవాత్సవ ప్రదీప్ పాల్గొన్నారు.

సచివాలయ కన్వీనర్లకు బీమా సౌకర్యం

రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్,
ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సచివాలయ కన్వీనర్లకు రూ.5లక్షలు ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో నరసాపురం నియోజకవర్గ సచివాలయ కన్వీనర్లతో జరిగిన సమావేశంలో ప్రసాదరాజు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరేలా సచివాలయ కన్వీనర్లు బాధ్యత తీసుకోవాలన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల కోసం ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నారని అన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య సచివాలయ కన్వీనర్లు ఒక వారధిలా పనిచేయాలని సూచించారు. రానున్న రోజుల్లో పార్టీ మరింత బలోపేతం చేసి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సచివాలయ కన్వీనర్లకు ప్రసాదరాజు సూచించారు.

నరసాపురాన్ని అభివృద్ధి చేస్తున్నాం

నరసాపురం పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే ప్రసాదరాజు తెలిపారు. ఇప్పటికే బస్టాండ్‌ను అభివృద్ధి చేసుకున్నామని, వంద పడకల ఆసుపత్రి నిర్మించుకున్నామని, దర్బరేవు కంపెనీ భూముల సమస్యను పరిష్కరించుకున్నామని, ఆక్వా యూనివర్శిటీ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, మేజర్ ప్రాజెక్టులన్నింటికీ నిధులు మంజూరు చేసుకున్నామని, జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేసుకున్నామని, పేరుపాలెం బీచ్‌ను సుందరంగా నిర్మించుకున్నామని, ఇలా చెప్పుకుంటూ పోతే నరసాపురం నియోజకవర్గాన్ని మునుపెన్నడూ లేనివిధంగా అభివృద్ధి చేశామని ప్రసాదరాజు చెప్పారు. సీఎం జగన్‌ను ఢీకొట్టడానికి అన్ని రాజకీయ పార్టీలు ఏకమవుతున్నాయని, ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీని బలోపేతం చేయడంలో పార్టీ శ్రేణుల పాత్ర కీలకమని ప్రసాదరాజు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, మొగల్తూరు జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాబ్జి, నరసాపురం జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, దొంగా మురళీకృష్ణ, కర్రి ఏసుబాబు, కడలి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నానాజీకి మూడోసారి ఉత్తమ ఉద్యోగి అవార్డు


కలెక్టర్ నుంచి అవార్డును అందుకుంటున్న నానాజీ

నరసాపురం రూరల్: నరసాపురం మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నానాజీ ఉత్తమ ఉద్యోగిగా మూడోసారి అవార్డును అందుకుని హ్యాట్రిక్ సాధించారు. భీమవరం కలెక్టరేట్‌లో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో నానాజీ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డును, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. మున్సిపాలిటీలో కూడా నానాజీ ఉత్తమ ఉద్యోగి అవార్డుకు ఎంపికై చీఫ్ విప్ ప్రసాదరాజు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నానాజీని అభినందించారు.

కేదారీ ఘాట్ ప్రక్షాళనకు మాజీ మంత్రి ఆదేశం


సిద్ధాంతంలో కేదారీ ఘాట్‌ను పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: వశిష్ఠ గోదావరి కేదారీ ఘాట్ ప్రక్షాళనకు సత్వరమే చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అధికారులను ఆదేశించారు. గురువారం సిద్ధాంతం వశిష్ఠ గోదావరి తీరంలో చేపట్టబోయే కేదారీ ఘాట్ శ్మశాన వాటిక అభివృద్ధిపై స్థానికులతో చర్చించి, ఘాట్‌ను పరిశీలించారు. పుష్కర రేవుల్లో మట్టి పేరుకుపోవడం, దేవతా మూర్తుల విగ్రహాలు పడి ఉండటం, చెత్తాచెదారం పేరుకుపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలోని చెత్తను గోదావరిలో వేయడానికి వీలు లేదన్నారు. వశిష్ఠ గోదావరి తీరానికి చెత్త బళ్లు వస్తే వెంటనే సీజ్ చేయాలని పోలీసులకు ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.గురుమూర్తి రెడ్డి, ఎంపీడీవో ఎస్.శ్రీనివాస్ దొర, రామన్నపాలెం సర్పంచ్ యర్రంశెట్టి బుజ్జి, వైఎస్సార్ సీపీ నాయకుడు సుతాపల్లి సత్తిబాబు, సొసైటీ అధ్యక్షుడు బలువు కృష్ణమూర్తి, పార్టీ అధ్యక్షుడు జుత్తిగ దామోదరం పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా ఇంటింటి సర్వే వేగవంతం కావాలి

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి


పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాలలో సచివాలయ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి

పాలకొల్లు అర్బన్ : ఓటర్ల జాబితా ఇంటింటి పరిశీలన కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాల గ్రామ సచివాలయాన్ని గురువారం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఇంటింటి సర్వేలో ఎన్ని ఇళ్లు పూర్తయ్యాయి, ఇంకా ఎన్ని ఇళ్లు మిగిలి ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. మరణించిన వారి ఓట్లు తొలగించారా, కొత్తగా ఎన్ని ఓట్లు నమోదు అయ్యాయి, మార్పులు, చేర్పుల వివరాలపై ఆరా తీశారు. రిజిస్టర్లు, కంప్యూటర్ డేటాను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితా పరిశీలనకు ఇంటింటికీ వెళ్లేటప్పుడు వలంటీర్లను వెంట తీసుకువెళ్లరాదన్నారు. అలాగే బీఎల్‌వోలు, బీఎల్ఏలు తప్పనిసరిగా ఇంటింట సర్వేలో ఉండాలన్నారు. ఫారం 6, 7, 8పై పూర్తి అవగాహన కల్గి ఉండాలన్నారు. ప్రతిదానికి తప్పనిసరిగా డాక్యుమెంట్ పేపర్స్ బీఎల్వో దగ్గర ఎప్పుడు సిద్ధంగా ఉండాలన్నారు. ఒకే డోర్ నెంబర్‌లో 10 ఓట్లు ఉంటే మళ్లీ ఒకసారి పరిశీలన చేయాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సీహెచ్ పెద్దిరాజు, ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఓటర్ల జాబితా సర్వే తనిఖీ

నరసాపురం రూరల్ : నరసాపురం పట్టణంలో ఓటర్ల జాబితా ఇంటింటి సర్వే చురుగ్గా సాగుతోంది. ఈనెల 21తో ముగియనున్న ఈ సర్వేను మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే పూర్తి చేయడానికి మరో నాలుగు రోజులు మాత్రమే గడువు ఉండటంతో ఉదయం 6 గంటల నుండే బీఎల్‌వోలు తమ పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో సర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఫారం 6,7,8లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి ఓట్ల తొలగింపునకు ఈ సర్వేలో ప్రాధాన్యత ఇస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. కమిషనర్ వెంట సిబ్బంది శేషగిరి, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు ఉన్నారు.

21లోగా ఓటర్ల పరిశీలన పూర్తి చేయాలి

పోడూరు: మండలంలో అన్ని గ్రామాల్లోనూ ఓటర్ల పరిశీలన కార్యక్రమాన్ని ఈనెల 21వ తేదీ సాయంత్రంలోపు ఖచ్చితంగా పూర్తి చేయాలని తహసీల్దార్ కృష్ణారావు సూచించారు. పోడూరులో ఇంటింటా జరుగుతున్న ఓటరు పరిశీలనా కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదు, చిరునామాల మార్పు, చనిపోయిన వారి ఓట్ల తొలగింపులో ఎక్కడా ఎటువంటి తప్పులు దొర్లకూడదని సూచించారు. అలాగే ప్రతి బూత్ స్థాయి అధికారి ఒక ప్రత్యేక రికార్డును నిర్వహించాలని కోరారు. ఈ ప్రక్రియలో ఎక్కడా వలంటీర్ల ప్రమేయం లేకుండా చూడాలని సూచించారు. ఉన్నతాధికారుల క్షేత్రస్థాయి పరిశీలన జరుగుతున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శీలబోయిన జయ రామకృష్ణ, వీఆర్వోలు కుమార్, వర్మ బీఎల్‌వోలు పాల్గొన్నారు.

అధికారుల పనితీరుకు అవార్డులు గీటురాయి


యలమంచిలి తహసీల్దార్ మాతా సునీల్ కుమార్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ దళిత నాయకులు

యలమంచిలి: అధికారుల పనితీరుకు అవార్డులు గీటురాయి వంటివని ఎంపీపీ రావూరి వెంకట రమణ అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ తహసీల్దార్ అవార్డు అందుకున్న యలమంచిలి తహసీల్దార్ మాతా సునీల్ కుమార్‌ను కార్యాలయంలో గురువారం సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులతో కలిసి ఆమె సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన రెండు నెలల కాలంలోనే జగనన్న సురక్ష సభలను దిగ్విజయంగా నిర్వహించడం, గోదావరి వరదలను సమర్థవంతంగా ఎదుర్కొని బాధితులకు సకాలంలో సహాయం చేయడంలో సునీల్ కుమార్ పనితీరు ప్రశంసనీయమన్నారు. ఆయన సేవలను ప్రభుత్వం గుర్తించి అవార్డు ఇవ్వడం సమంజసమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు వల్లభు సాయి వెంకట నరసింహారావు, సచివాలయ మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు, వైస్ ఎంపీపీ కొప్పాడి శ్రీనుబాబు, సర్పంచ్‌లు కవురు గోపి, గటిగంటి మహేష్, పాలంకి శ్రీనివాసరావు, పొన్నమండ నాగరాజు, కామిశెట్టి సాయిబాబు, ఎంపీటీసీ సభ్యులు డేగల సూర్యప్రభ, కడలి ఏడుకొండలు, సొసైటీ అధ్యక్షులు గుబ్బల రామకృష్ణ, చివటపు నాగేశ్వరరావు, గుర్రాల వెంకట్రావు పాల్గొన్నారు. అంతకుముందు వైఎస్సార్ సీపీ దళిత నాయకులు తహసీల్దార్ సునీల్ కుమార్‌ను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉచ్చుల స్టాలిన్, జవదాల సువర్ణరాజు, మోకా నరసింహారావు, బొంతు వెంకట కర్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరి నారు కొనలు తుంచి నాటండి


పొలం బడిలో పాల్గొన్న వ్యవసాయాధికారులు, రైతులు

యలమంచిలి: వరి సాగు చేసే రైతులు నారు ఊడ్చే సమయంలో కొనలు త్రుంచి ఊడ్చాలని నరసాపురం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఈద అనిల్ కుమారి సూచించారు. బూరుగుపల్లి గ్రామంలో గురువారం జరిగిన వైఎస్సార్ పొలం బడి కార్యక్రమంలో వరి సాగులో పాటించాల్సిన మెళకువలను ఆమె రైతులకు వివరించారు. మండల వ్యవసాయాధికారి చిండులూరి దేవి మాట్లాడుతూ రైతులంతా తాము సాగు చేసిన పంట వివరాలను సంబంధిత గ్రామ రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి వ్యవసాయ సహాయకుల ద్వారా నమోదు చేయించుకోవాలని కోరారు. పంట నమోదు యాప్‌లో కొత్త సాఫ్ట్‌వేర్ వచ్చిందని, రైతులు తాము సాగు చేసే భూమిలో ఎన్ని సర్వే నెంబర్లు ఉంటే అన్నీ యాప్‌లో నమోదు చేయించుకోవాలని ఆమె సూచించారు. ఊడ్పులు పూర్తికాగానే ఆధార్, పంట రకం, విత్తిన తేదీ వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు. కొత్త యాప్‌లో నమోదు చేసిన ప్రతి సర్వే నెంబర్ దగ్గరకు వెళ్లి జియో కార్డినేట్స్ ద్వారా ఫొటో తీసుకోవాలని ఆమె చెప్పారు. రైతులు పంట నమోదు సక్రమంగా చేయించుకుని ప్రభుత్వం అందించే సబ్సిడీలు పొందాలని ఆమె కోరారు.

మితిమీరి ఎరువులను వాడొద్దు

మొగల్తూరు: వరి సాగులో మితిమీరి ఎరువులు, పురుగుమందులను వాడొద్దని వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ సూచించారు. గురువారం శేరేపాలెం పంచాయతీ నవుడూరు గరువులో నిర్వహించిన పొలం బడి కార్యక్రమంలో ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. ఎరువులు, పురుగుమందులను ఎక్కువగా వినియోగించడం వల్ల నేల స్వభావం మారి దిగుబడిపై ప్రభావం చూపుతుందన్నారు. అనంతరం గ్రామంలో ఇటీవల వేసిన నాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో రైతు గూడూరి మావుళ్ళు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పొలం బడితో తగ్గుతున్న సాగు ఖర్చు

పెనుగొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయాన్ని లాభసాటిగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో అమలు చేస్తున్న పొలం బడితో రైతులకు సాగు ఖర్చు తగ్గుతుందని ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు, కొడమంచిలి సర్పంచ్ సుంకర సీతారామ్ తెలిపారు. గురువారం కొడమంచిలిలో పొలం బడి నిర్వహించి పొలం పరిసరాల విశ్లేషణ, భాగస్వామ్య కార్యాచరణ ప్రణాళికలపై రైతులకు అవగాహన కల్పించారు. దీంతో పాటు ఆకుల కత్తిరింపు, పిలకల తొలగింపు, సాగు విస్తీర్ణంలో లెక్కింపు చేపట్టి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రకృతి వ్యవసాయంపై అవగా హన కల్పిస్తూ లింగాకర్షణ, బుట్టలు, వేప పిండి, సుడోమోనాస్ ఉపయోగాలను వివరించారు. వ్యవసాయ శాఖ విస్తరణాధికారి బి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలిలో కేంద్ర బృందం పర్యటన


యలమంచిలి హైస్కూల్ వద్ద కేంద్ర బృందం సభ్యులతో స్థానిక నాయకులు

యలమంచిలి: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ పథకం అమలు తీరును కేంద్ర బృందం గురువారం తనిఖీ చేసింది. మండలంలోని యలమంచిలి, యలమంచిలి లంక, బూరుగుపల్లి గ్రామాల్లో బృంద సభ్యులు పర్యటించారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, చెత్త సంపద కేంద్రాలతో పాటు ప్రతి గ్రామంలోని 15 ఇళ్ల పరిసరాలను వారు పరిశీలించారు. అనంతరం పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ పాలకవర్గాలకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లాలోని 26 గ్రామ పంచాయతీల్లో ఈ బృందం పర్యటించింది. కేంద్ర బృందం వెంట ఎంపీపీ రావూరి వెంకట రమణ (బుజ్జి) సర్పంచ్‌లు వల్లభు సాయి వెంకట నరసింహారావు, బర్రే మేరీ ప్రసాద్, గ్రామ కార్యదర్శి పాలా శారదా శ్రీనివాస్ ఉన్నారు.

వల్లూరులో..

పెనుగొండ: ఆచంట మండలం వల్లూరులో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ అమలును గురువారం కేంద్ర బృందం డీపీఆర్ సీటీఎం ఎడ్వర్డ్, కో ఆర్డినేటర్ అజయ్ ఆధ్వర్యంలో పరిశీలించింది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి, దీనిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ చిల్లే లావణ్య, ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి, జెడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, సర్పంచ్ నేలపూడి బేబీ, వైస్ ఎంపీపీ తాళం శ్రీను, పంచాయతీ కార్యదర్శి జీవీవీ సత్యనారాయణ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించండి


మొగల్తూరు పడమటి పాలెంలో రైతులకు అందజేసిన కిట్లతో వ్యవసాయాధికారులు

మొగల్తూరు: ప్రకృతి వ్యవసాయంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయ విభాగం డివిజన్ ఇన్‌ఛార్జి ఎ.నరసింగరావు కోరారు. గురువారం మొగల్తూరు పంచాయతీ పడమటి పాలెంలోని రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటి పెరట్లో, చేల గట్లు వెంబడి కూడా ప్రకృతి వ్యవసాయం చేపట్టవచ్చునన్నారు. ఈ సందర్భంగా వేప పిండి 3 కేజీలు, ఇంగువ 250 గ్రాములు, లింగాకర్షణ బుట్టలు 4, కంది విత్తనాలు 50 గ్రాములు, జీవామృతం 2 లీటర్లు, కిచెన్ గార్డెన్ ప్యాకెట్లు 2 ఉన్న కిట్లను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో రహీమ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చిట్టవరం గ్రామంలో..

నరసాపురం రూరల్: మండలంలోని చిట్టవరం గ్రామంలో గురువారం ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటల సాగు, తెగుళ్ల నివారణ తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ శిక్షణ డివిజన్ ఇన్‌ఛార్జి నరసింగరావు, మండల ఇన్‌ఛార్జి కె.నాగరాజు వరి పంటను ఆశించే పురుగులు, తెగుళ్ల నివారణకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శామ్యూల్ జాన్సన్, గ్రామ సర్పంచ్ తాడి లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు నక్కా లక్ష్మీనారాయణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

పాలకొల్లు అర్బన్: ది పాలకొల్లు ఆర్టిస్ట్స్ అండ్ పెయింటర్స్ అసోసియేషన్ 44వ సర్వసభ్య సమావేశం సంఘ అధ్యక్షుడు పెనుమాళ్ల వెంకట రమణారెడ్డి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ పెయింటర్ పోతుమంచిలి సత్యనారాయణను సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. 2023–25 సంవత్సరాలకు గానూ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.